క్లుప్తంగా

తుపాను సహాయక కేంద్రం ఏర్పాటు


తహసీల్దారు శ్రీను

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని తుపాను సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు ఎం.శ్రీను తెలిపారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో శనివారం మాట్లాడుతూ రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రజల సహాయార్థం సహాయక కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుపాను కారణంగా ప్రమాదంలో చిక్కుకున్న వారు సహాయం కోసం ఫోన్ నంబర్ 9182881540ను సంప్రదించాలన్నారు. 24 గంటలూ కేంద్రం పనిచేస్తుందన్నారు.

ఆలయ ప్రధానార్చకుడి మృతి


అప్పలచారి(ఫైల్)

బొబ్బిలి: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు భద్దం అప్పలచారి(66) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే బేబీనాయన శనివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. 30 ఏళ్లుగా ఆయన ఆలయానికి, ఆలయ అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

ఎడతెరిపిలేని వాన


వర్షపునీటిలో రాజాం-పాలకొండ రోడ్డు

రాజాం: మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో శనివారం ఎడతెరిపిలేని వాన కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన కారణంగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, చెరువులు, నదులు, కాలువలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తూ కనిపించాయి.

దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ


వన్నలిలో వరి పంటపై దశపర్ణి కషాయం పిచికారీ చేస్తున్న దృశ్యం

రేగిడి: పంటలపై దశపర్ణి కషాయం పిచికారీ చేయడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అన్నారు. మండలంలోని చాటాయివలస, వన్నలి, ఉప్పర్నాయుడు వలస గ్రామాల్లో పంటలపై దశపర్ణి కషాయం పిచికారీ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటలతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు


చేతులెత్తడం ద్వారా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటున్న మహిళలు

రాజాం: పట్టణంలోని మండల మహిళా సమాఖ్య(ఎంఎంఎస్) కార్యాలయంలో మండల మహిళా వార్షిక మహాజన సభ శనివారం నిర్వహించారు. వెలుగు ఏపీ ఎ.చిరంజీవి ఆధ్వర్యంలో ఎంఎంఎస్ నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఎన్నిక చేపట్టారు. అధ్యక్షురాలిగా రౌతు వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలిగా మద్దు జ్యోతి, కార్యదర్శిగా పొట్నూరు పైడితల్లి, సహాయ కార్యదర్శిగా టంకాల స్వాతి, కోశాధికారిగా కొయ్యాన పార్వతిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం ఎన్.అప్పలనాయుడు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల పనితీరుపై ఆరా తీసి, సమావేశాలు, సంఘాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

కాల్ సెంటర్ ఏర్పాటు

రాజాం: సక్రమంగా పింఛన్ల పంపిణీ నిమిత్తం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. వెలుగు ఏపీ ఎ.చిరంజీవి ఇదే కాల్ సెంటర్ నుంచి గ్రామాల్లోని సీసీలు, సీఏలను అప్రమత్తం చేసి, పింఛన్లు అందజేస్తున్న ఉద్యోగులకు సహకరించాలని సూచించారు. లబ్ధిదారులందరికీ పింఛన్ అందేలా చూడాలని తెలిపారు. ఏదైనా కారణంతో పింఛన్ డబ్బులు అందని వారి వివరాలు సేకరించి, వారికి సకాలంలో పింఛన్ అందేలా చూడాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● మొక్కలు నాటే కార్యక్రమంలో వక్తలు

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని జన్నివలస గ్రామ సచివాలయం ఆవరణలో ఆమె శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకం పైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అడవుల శాతం తగ్గిపోతుండడంతోనే విపత్తులు తలెత్తుతున్నాయన్నారు. మొక్కలు పెంచడమనేది సామాజిక బాధ్యత అని, అందరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సారంగదొర, ఏపీవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొక్కలు నాటామని, మొక్కలు సమకూర్చడంలో రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సహకరించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. మొక్కల పెంపకం బాధ్యతలను విద్యార్థులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో బి.గోపి, రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్ వీజే నాయుడు, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజాం: మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్న జూనియర్ కళాశాల విద్యార్థులు


బాడంగి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి


రామభద్రపురం: మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి

రేగిడి: మండలంలోని బూరాడ, లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో చిన్నారుల తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. తల్లి పేరిట ఓ చెట్టు కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ నూకాలమ్మ, శశికళల సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు కార్యకర్తలు తెలిపారు.

బాడంగి: అమ్మ పేరిట ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. చిన్నారుల తల్లిదండ్రులతో సిబ్బంది మొక్కలు నాటించారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్య, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు నాటాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు కోరారు. ఇదిలా ఉండగా, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కండి చిట్టమ్మకు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటడంలో నిమగ్నమైన చిన్నారుల తల్లిదండ్రులు


రేగిడి: బూరాడ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

రిలయన్స్ స్మార్ట్‌బజార్‌పై చర్యలు తీసుకోండి

● మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో సభ్యుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ


రిలయన్స్ స్మార్ట్‌బజార్ రోడ్డులో నిలిపిన వాహనాలు

బొబ్బిలి:

పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్‌బజార్‌పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఇరుకైన రోడ్డులో స్మార్ట్‌బజార్ పెట్టడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 10 అడుగుల వెడల్పు కూడా లేని రోడ్డులో స్మార్ట్‌బజార్ ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. స్మార్ట్‌బజార్ కారణంగా చిరు కిరాణా వ్యాపారులు ఎంతోమంది నష్టపోతున్నారన్నారు. దీనిని పలువురు కౌన్సిలర్లు సమర్థించారు. మున్సిపల్ సిబ్బంది లంచాలు తీసుకుని, పట్టణంలో జరుగుతున్న ఆక్రమణలను వదిలేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. వీటన్నింటిపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే మున్సిపల్ కమిషనర్ సమావేశాలకు హాజరుకావడం లేదని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం చేసిన తీర్మానాలను సభ్యులు ఆమోదించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ఆరోగ్య కార్యదర్శులతో శనివారం ఆయన సమావేశమై, ప్రజల ఆరోగ్య పరిస్థితులు, సీజనల్ వ్యాధుల విజృంభణ వంటి వాటిపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో మురుగు, వర్షపు నీటి నిల్వల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు ప్రబలుతాయని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఓ వైపు పారిశుధ్య చర్యలను ముమ్మరం చేస్తూ మరోవైపు ప్రజలను పారిశుధ్యం వైపు చైతన్యం చేయాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం

బాడంగి: ఎస్సీ వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాల్లోని ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని మాదిగ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లాడ సురేంద్రబాబు అన్నారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పుతో ఎంఆర్‌పీఎస్ ద్వారా 30 ఏళ్ల పాటు చేసిన పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాదిగలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం దక్కుతుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఇదొక చక్కని అవకాశమన్నారు.

నది తీరానికి ఎవరూ వెళ్లవద్దు


పాల్తేరు-అలజంగి రేవు వద్ద వేగావతి నదిని పరిశీలిస్తున్న తహసీల్దారు సుధాకర్

బాడంగి: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరూ నదీతీరానికి దగ్గరగా వెళ్లవద్దని తహసీల్దారు సుధాకర్ సూచించారు. మండలంలోని పాల్తేరు-అలజంగి రేవు వద్ద వేగావతి నది పరిస్థితిని ఆయన శనివారం పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టి, నదుల్లో వరదనీటి ప్రవాహం తగ్గేంత వరకు నదులకు ఎవరూ వెళ్లవద్దని తెలిపారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా నదీతీర ప్రాంతాల్లోని గొల్లాది, భీమవరం, పాల్తేరు, అల్లుపాల్తేరు, హరిజనపాల్తేరు, ఆనవరం, పినపెంకి గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మెంటిపేట ఎస్సీ కాలనీలోని కాలువల్లో దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ శనివారం చేపట్టారు. నీటి నిల్వలు, కాలువల్లో పేరుకుపోయే మురుగులో విపరీతంగా దోమలు పెరిగి తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయని ఈ నేపథ్యంలో ఆయా వ్యాధుల బారినపడకుండా పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు


మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: పట్టణంలో పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా ఆటోలు, పండ్లబళ్లు రోడ్డుపై ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఆటోడ్రైవర్లు, పండ్లబళ్ల వ్యాపారులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆటోలు ప్రధాన కూడళ్ల వద్ద నిలపకుండా 25 మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. పట్టణంలో తిరిగే ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయించాలని, ఆటోలను ఎక్కడపడితే నిలపవద్దన్నారు. అలాగే యూనిఫాం తప్పనిసరిగా ధరించడంతో పాటు విధిగా లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటోలో సౌండ్‌బాక్స్‌లు పెట్టకూడదని, మితిమీరి ప్రయాణికులను తీసుకువెళ్లకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం


రాజాం సిటీ: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



బొబ్బిలి: మట్టి విగ్రహాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రాజాం సిటీ: ప్రతి ఒక్కరం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీకాకుళం రోడ్డులో వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో కల్కి జువెలర్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్)కి బదులుగా మట్టి విగ్రహాలనే వాడాలని కోరారు. పీవోపీ విగ్రహాలు వాడడం వల్ల పర్యావరణం కలుషితమవుతోందన్నారు. స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో మట్టి విగ్రహాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీపీ రమణమూర్తి, కొత్తా మధుసూదనరావు, పొట్నూరు లక్ష్మణరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండల కేంద్రంలోని తారకరామా కాలనీలో అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే బేబీనాయన ఈ కార్యక్రమంలో పాల్గొని, పలువురికి ఆయన చేతులమీదుగా విగ్రహాలు అందజేశారు. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడవద్దన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొబ్బిలి: ఐటీఐ విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) డిమాండ్ చేస్తోంది. ఇదే విషయమై మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్‌లు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఐటీఐ రెండో ఏడాది పబ్లిక్ పరీక్షలు జరగ్గా, ఉత్తీర్ణులు కావాలంటే ఒక్కో విద్యార్థి రూ.2 వేలు చొప్పున ఇవ్వాలని, వసూలు చేశారన్నారు. ప్రభుత్వ ఐటీఐలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు రెగ్యులర్ ఉద్యోగి కలిసి ఈ అక్రమానికి పాల్పడినట్లు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐతో పాటు మూడు ప్రైవేటు ఐటీఐల్లో చదువుతున్న విద్యార్థులందరి దగ్గర నుంచి దాదాపు రూ.7 లక్షల వరకు వసూలు చేశారన్నారు. సిబ్బంది అవినీతి, అక్రమాలపై దర్యాప్తు నిర్వహించాలని, లేకపోతే సోమవారం ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అధికార లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు


హెచ్‌సీ నారాయణరావు అంత్యక్రియల దృశ్యం

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ) పైల నారాయణరావు(52) అంత్యక్రియలు శనివారం అధికార లాంఛనాల నడుమ నిర్వహించారు. విజయనగరం ఏఆర్ పోలీసుల గౌరవ వందనం అనంతరం దహన సంస్కారాలు చేశారు. రేగిడి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజాం రూరల్ సీఐ హనుమంతు ఉపేంద్రరావు, ఎస్ఐ షేక్ శంకర్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం తక్షణ సాయంగా రూ.25 వేలు అందజేశారు.

పింఛన్ల పంపిణీ


రాజాం సిటీ: పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు


రామభద్రపురం: చొక్కాపు వీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తెర్లాం/రామభద్రపురం/బొబ్బిలి రూరల్/రేగిడి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో శనివారమే పింఛన్లు అందించామని అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల ఒకేదగ్గర లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరామర్శ



రామినాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి


రాజాం సిటీ: మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

తెర్లాం: మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యర్రా రామినాయుడును మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో రామినాయుడు బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన.. నందబలగ గ్రామంలోని రామినాయుడు ఇంటికి శనివారం వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మార్బుల్ పలక మీదపడి, స్థానిక పట్టణ పరిధిలోని కొండంపేటకు చెందిన నందమూడి శశికుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి మృతదేహం రాజాం ప్రాంతీయ ఆస్పత్రిలో ఉందన్న విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అక్కడికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోస్టుమార్టం త్వరగా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబుకు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పాలవలస శ్యాంసుందర్, సలాది తులసీదాస్, సలాది సతీష్, ముద్దన సత్యారావు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


బొబ్బిలి రూరల్: వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

రాజాం సిటీ: తుపాను నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎస్‌కే రాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శనివారం సమావేశమైన ఆయన.. తుపాను కారణంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముందస్తు సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సిబ్బందిని అప్రమత్తం చేశామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు.

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో తహసీల్దారు ఎం.శ్రీను శనివారం సమావేశమై, పలు సూచనలు చేశారు. శనివారం అర్ధరాత్రి తుపాను తీరం దాటనున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. చెరువులు, నదులు, వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులను అప్రమత్తం చేసి, ప్రాణాపాయం, ఆస్తినష్టం జరగకుండా చూడాలన్నారు.

యూపీఎస్ రద్దు చేయండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి రూరల్: యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్)ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆమె యూటీఎఫ్ సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయకుండా సీపీఎస్ కన్నా ప్రమాదకరమైన యూపీఎస్‌ను తీసుకువచ్చిందని విమర్శించారు. ప్రపంచ మార్కెట్‌లోని బడా వ్యాపారవేత్తలకు పెట్టుబడులుగా పెన్షన్ నిధులను అప్పనంగా దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అమలుచేయాలని చూస్తున్న జీపీఎస్(గ్యారంటీ పెన్షన్ స్కీమ్)ను కూడా రద్దు చేయాలని కోరారు. వాటిని అమలు చేయాలని చూస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసన్నకుమార్ ఆనెం శ్రీనివాస్, సత్యనారాయణ, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.